క్లుప్తంగా

నేడు ఎంపీ కేశినేని పర్యటన

విస్సన్నపేట: మండలంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. తెల్లదేవరపల్లిలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్‌సెంటర్, పుట్రేలలో ఆర్‌బికే, వేమిరెడ్డిపల్లిలో సొసైటీ భవనాలను ఎంపీ ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొవాలని మండల పార్టీ అధ్యక్షుడు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నూజివీడు: మండలంలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ పాల్గొంటారు. అన్నవరం, ఓగిరాల తండా, కొత్తూరు తండా, యనమదల, బత్తుల వారిగూడెంలలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో జగనన్న చేయూత చెక్కుల పంపిణీ, మహిళలకు జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తారు.

ఇంటర్ పరీక్షలకు 62 మంది గైర్హాజరు

నూజివీడు: పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరం గణితం , జంతుశాస్త్రం, చరిత్ర సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 1,554 మంది విద్యార్థులకు 1,492 మంది హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 397 మందికి 28 మంది, వాగ్దేవి జూనియర్ కళాశాలలో 303 మందికి ఆరుగురు, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో 272 మందికి 10 మంది, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 234 మందికి 8 మంది, శ్రీ శారద కళాశాలలో 348 మందికి 10 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించారు. పరీక్ష కేంద్రాలకు సీఎస్‌లుగా దుర్గాప్రసాద్, టి.విజయ, ఉమాదేవి, సీహెచ్ జాన్, చంద్రశేఖర వర్మలు వ్యవహరించారు.

మహిళా పోలీసులకు సన్మానం



తిరువూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తిరువూరు సర్కిల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులను శనివారం సీఐ అబ్దుల్ నబీ స్థానిక పోలీసు స్టేషనులో సత్కరించారు. కుటుంబ బాధ్యతలతో పాటు విధి నిర్వహణలో అంకిత భావంతో మహిళా కానిస్టేబుల్స్ పనిచేస్తున్నారని సీఐ అభినందించారు. తిరువూరు ఎస్ఐ సత్యనారాయణరాజు, సర్కిల్లోని పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వెండి కిరీటాల వితరణ

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను రామలింగేశ్వరస్వామి ఆలయలోని పార్వతీదేవి, షిర్డీసాయి బాబాల విగ్రహాలకు అలంకరణకై భక్తులు రూ.90 వేల విలువైన వెండి కిరీటాలను శనివారం ఆలయంలో అందజేశారు. గ్రామానికి చెందిన దాతలు నాళ్ల వెంకట మోహన్‌రావు, నాగమణి దంపతులు వీటిని తయారు చేయించి అందజేశారు. దంపతులను ఆలయ అర్చకులు దాములూరి సత్యనారాయణశాస్త్రి ఆశీర్వదించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ బలగాల కవాతు



రెడ్డిగూడెం: త్వరలో జరగబోయే ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మకమైన కొత్తనాగులూరు గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి పోలీసులు పారా మిలటరీ బలగాలు కవాతు నిర్వహించారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని ప్రజలకు భరోసా కలిగించే విధంగా కేంద్ర బలగాలతో స్థానిక పోలీసులు కలిసి కవాతు నిర్వహించారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల కోడ్ రావచ్చని ఎన్నికల నిర్వహణకు కేంద్ర బలగాలు పోలీసులు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ గోవిందు పాల్గొన్నారు.

నూజివీడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును ఉపయోగించుకోవాలని డీఎస్పీ జి.లక్ష్మయ్య పేర్కొన్నారు. సాయుధ దళాల సిబ్బందితో శనివారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి పెద్ద గాంధీబొమ్మ సెంటర్, చిన్నగాంధీబొమ్మ సెంటర్, మున్సిపల్ కార్యాలయం సెంటర్, బస్టాండు సెంటర్ మీదుగా రాజీవ్ సర్కిల్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపైనా, రౌడీషీటర్లపైనా, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ పక్షాలు ఎన్నికల కోడ్‌ను పాటించి ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొత్తుల కోసం ఢిల్లీలో పడిగాపులు

చంద్రబాబుపై ఎంపీ కేశినేని విమర్శలు



తిరువూరులో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, వేదికపై స్వామిదాసు, ప్రజాప్రతినిధులు,అధికారులు

తిరువూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు ఉన్న తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు వచ్చే ఎన్నికల్లో గెలిచే సత్తా లేక పొత్తుల కోసం ఢిల్లీలో పడిగాపులు పడుతున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) విమర్శించారు. తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ చేయూత చెక్కులు, నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వార్థమే పరమావధిగా పాలన సాగించిన చంద్రబాబు రాష్ట్రంలో ప్రజాదరణ కోల్పోయారని, ఈ ఎన్నికల్లో ఆయన పార్టీకి డిపాజిట్లు కూడా రావన్నారు. బీజేపీ దయాదాక్షిణ్యాల కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఎంతమందితో పొత్తు పెట్టుకున్నా వైఎస్సార్ సీపీ ఘన విజయం తథ్యమన్నారు. ప్రజలకు ఏమి అవసరమో గుర్తించి అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని 802 మందికి, మండలంలోని పలు గ్రామాలకు చెందిన 901 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎంపీ పంపిణీ చేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద తిరువూరు పట్టణంలో 1,643 మంది మహిళలకు రూ.3 కోట్ల మేర చెక్కులను అందజేశారు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి, కమిషనర్ లోవరాజు, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు. తిరువూరు నగర పంచాయతీ మెప్మా సభ్యులు అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేసి తాము తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు.

వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేయాలి



వైఎస్సార్ చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ కేశినేని, పక్కన స్వామిదాసు

గంపలగూడెం: ప్రజల బాగుకోరుకొనే వైఎస్ జగన్‌ను మరో పర్యాయం ముఖ్యమంత్రిని చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని విజయవాడ ఎంపీ కేశినేని నాని పేర్కొన్నారు. మండలంలోని మేడూరులో రూ.45 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్‌కేంద్రం, అమ్మిరెడ్డిగూడెంలో రూ.88 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌సెంటర్‌లను ఆయన వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్లస్వామిదాసులు కలిసి ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత పథకంలో మండలంలోని 4,571మంది లబ్ధిదారులకు రూ.8.57 లక్షల నగదును విడుదల చేశారు. మండల పరిధిలోని 1,844 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్టర్ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఎంపీ మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి కావల్సిన సంక్షేమ పథకాలతో సుపరిపాలన చేస్తున్న వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే.. ఒట్టి అబద్ధాలకోరు చంద్రబాబు అని విమర్శించారు. రైతులకు మెరుగైన సేవల్ని అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య కోసం వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేసిన ఘనత జగనన్నదే అన్నారు.

31 లక్షల ఇండ్ల స్థలాల పంపిణీ

జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా చూడని విధంగా ఒకేసారి 31 లక్షల నివేశన స్థలాల్ని పంపిణీ చేశారన్నారు. నివేశన స్థలాల్ని పంపిణీ చేయడమే కాకుండా వాటిని లబ్ధిదారుని పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేపట్టి వారికి స్థలంపై సంపూర్ణ హక్కులు కల్పిస్తున్నారని వివరించారు. టీడీపీ పాలనలో ఒక్క సెంటు భూమికూడా లేనివారికి పంపిణీ చేయలేదని ఆరోపించారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కావూరి వినయ్‌కుమార్. జిల్లా కమిటీసభ్యులు చెరుకు నర్సారెడ్డి, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమా, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ కోట దాసు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు సొసైటీ అధ్యక్షులు, ఎంపీడీవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎంపీ, స్వామిదాసులు మేడూరు శ్రీవీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు.

రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవనాల ప్రారంభం

తిరువూరురూరల్: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. శనివారం తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాల భవనాలను ప్రారంభించిన ఆయన చౌటపల్లిలో జరిగిన సభలో మాట్లాడారు. రైతులు మండల కేంద్రానికి వచ్చే అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే వ్యవసాయ శాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాలూ అమలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చౌటపల్లి, చిట్టేల, వావిలాల, పెద్దవరం, ముష్టికుంట్ల గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లను, చౌటపల్లిలో డిజిటల్ గ్రంథాలయాన్ని ఎంపీ ప్రారంభించారు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నల్లగట్ల స్వామిదాసు, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కలకొండ రవికుమార్, గుడిపూడి నారాయణరావు, బండి రవికుమార్, తాళ్ళూరి నవీన్, ముక్కామల సీతారామయ్య, కొమ్మినేని కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



ఏ.కొండూరు: గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ గుండా సురేంద్ర అన్నారు. మండలంలోని రేపూడి తండాలో శనివారం గిరిజన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారించటానికి ప్రభుత్వానికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయటానికి మంచి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు కొన్ని సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తానని హామినిచ్చారు. సర్పంచ్ భూక్య చంటి, ఎంపీటీసీ బి.కేసియా పాల్గొన్నారు. గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

దైవ సేవకుల ఐక్యవేదిక

నూజివీడు: స్థానిక స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం రాత్రి దైవసేవకుల ఐక్యవేదిక అనే అంశంతో ఆత్మీయ సమావేశం శుక్రవారం రాత్రి జరిగింది. సుమారు 200 మంది దైవజనులతో ఐక్యవేదిక కమిటీ సభ్యులు పాస్టర్లు చంద్రకుమార్, రమేష్ బాబు, స్పర్జన్ రాజు, జ్యోతి వరప్రసాద్, జాన్ వెస్లీ, విజయకుమార్, డేనియల్, వరప్రసాద్, బాబుల ఆధ్వర్యంలో నిర్వహించారు. బండి శ్యామ్ దైవసందేశం అందించారు. ఐక్యవేదిక కమిటీ లీగల్ అడ్వైజర్, న్యాయవాది కేజే డిక్సన్, పాస్టర్లు టి.ప్రభాకర్, సాల్మన్ రాజు, యోబు రానున్న రోజుల్లో క్రీస్తు సువార్తను చాటేందుకు అవసరమైన కార్యచరణ, తదితర అంశాలపై చర్చించారు.

మహిళాభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



చాట్రాయిలో వైఎస్సార్ చేయూత చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఆశయయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శనివారం చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన వైఎస్సార్ చేయూత పథకం చెక్కు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. 30 లక్షల మందికి నివేశన స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణాల పూర్తి చేసి అక్కా చెల్లెమ్మలకు అందజేశారని, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలను అందజేశారని, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు మంజూరు చేశారని వివరించారు. ఇలాంటి ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకుందామా అనగానే గెలిపించుకుంటామని మహిళలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. చంద్రబాబు చెప్పే హామీలు నమ్మవద్దని ఎమ్మెల్యే కోరారు. అనంతరం 3,586 మంది మహిళలకు రూ.6.72 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. అనంతరం కొత్తగూడెంలో వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శనివారం మండలంలోని చనుబండలో రూ.60 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకు, సూరంపాలెం, చనుబండలో రూ.27 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, సూరంపాలెంలో దళితవాడలో రూ.20 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, చాట్రాయిలో రూ.9 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, పోలవరంలో రూ.15 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, రూ.32 లక్షలతో నిర్మించిన కోఆపరేటివ్ బ్యాంకు అదనపు గది, రూ.14 లక్షలతో దళితవాడలో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.20 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రెండు బోర్లు, పైపులైన్, కొత్తగూడెంలో రూ.25 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకు పైపులైన్, యర్రవారిగూడెంలో పూర్తి అయిన వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. రూ.1.98 కోట్లతో చేపట్టే పోలవరం నుంచి యడవల్లి వెళ్లే బీటీ రోడ్డు, చిత్తపూరులో రూ.83 లక్షలతో చేపట్టే వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు, రూ.1.58 కోట్లతో చేపట్టే పెట్రోల్ బంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నూజివీడుకి వలస వాదులు, నమ్మక ద్రోహులు వస్తున్నారని వారి మాటలను నమ్మవద్దని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి సూచించారు. ప్రతాప్ అప్పారావు భారీ మెజార్టీతో గెలిపించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధగా ఉన్నారని ఆమె తెలిపారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, వైస్ ఎంపీపీలు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, చెలికాని బాబ్జి, జెడ్పీటీసీ చెలికాని అనూషా, దామెర ప్రసాదుబాబు, మోరంపూడి నాగేశ్వరావు, సర్పంచ్‌లు విస్సంపల్లి జ్యోతి, సత్తెనపల్లి లక్ష్మి, చల్లగుళ్ల వెంకటేశ్వరావు, శోభన్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిరామయ్య, పరసా చెన్నారావు, పామర్తి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ పాలకవర్గం



నూజివీడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణవేణి

నూజివీడు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గం శనివారం బాధ్యతలు చేపట్టింది. ఏఎంసీ చైర్‌పర్సన్ కంభాల కృష్ణవేణి, వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్యలతో పాటు 17 మంది డైరెక్టర్లు ఏఎంసీ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కంభాల రాంబాబు సతీమణి కృష్ణవేణి చైర్‌పర్సన్‌గా, అదే మండలం అక్కిరెడ్డిగూడెంకు చెందిన బర్మా సీతారామయ్యను వైస్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఏఎంసీ సెక్రటరీ పి.శ్రీనివాసరావు వారితో బాధ్యతలు స్వీకరింపచేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు, మార్కెట్ కమిటీ ఆదాయాన్ని పెంచి తద్వారా కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

చైర్‌పర్సన్‌గా తొలిసారి ఎస్సీ మహిళకు అవకాశం

నూజివీడు ఏఎంసీ చైర్‌పర్సన్ పీఠంపై తొలిసారి ఎస్సీ వర్గానికి చెందిన మహిళను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో ఇది సాధ్యమైంది. వాస్తవానికి చైర్‌పర్సన్ పీఠం జనరల్ మహిళకు కేటాయించగా ఆ స్థానంలో ఎస్సీ మహిళకు స్థానం కల్పించారు. దీనిని బట్టే బడుగు, బలహీన వర్గాలంటే వైఎస్సార్ సీపీ ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో అర్థమవుతోంది. కార్యక్రమంలో ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ ముసునూరు మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ఆగిరిపల్లి జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, కాట్రేనిపాడు సొసైటీ అధ్యక్షుడు యనమదల రాజేంద్ర ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, నాయకులు కంభాల రాంబాబు, కంచర్ల లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం



మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, నాయకులు

రోలుపడి(తిరువూరు): మండలంలోని రోలుపడిలో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మేము సిద్ధం , మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి ఆధ్వర్యంలో గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు వివరించారు. లబ్ధిదారులు మళ్లీ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచి ముండ్లపాటి కాంతమ్మ, ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ బండి రవికుమార్, పార్టీ నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, సుధీర్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ధైర్యంగా పోరాడాలి

ఆగిరిపల్లి: మహిళలు తమ హక్కుల కోసం ధైర్యంగా పోరాడాలని పిన్నమ్మ రెడ్డిపల్లి సర్పంచ్ జోల భూషణం అన్నారు. శనివారం ఎస్ఏపేటలో స్ఫూర్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు కంచర్ల నిర్మల కుమారి మాట్లాడుతూ మహిళలు ఒకరిపై ఆధారపడకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకొనే స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ లక్ష్మి, స్ఫూర్తి మహిళా సంఘం ఇన్‌చార్జి ఇందిరా, సిస్టర్స్ రమ్య, సోఫియా, సెల్వి, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

చలివేంద్రం ప్రారంభం




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తిరువూరు చీరాల సెంటర్లో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు చల్లని తాగునీటిని అందించేందుకు ఈ చలివేంద్రం ఏటా ఏర్పాటు చేస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం (దోస్త్) సభ్యులు తెలిపారు. ప్రవాసాంధ్రుడు దుక్కిపాటి మురళీకృష్ణ, చిత్తలూరి సోమశేఖర్, పరసా నెహ్రూజీ, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ బాలికలకు పురస్కారాల అందజేత

కొండపల్లి: జిల్లా పరిషత్ పాఠశాల బాలికలు కోరమండల్ నగదు పురస్కారాలకు ఎంపికయ్యారు. ఎంబీవీకే భవనంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కె.మేఘన, ఎం.కీర్తన, ఉషారాణి, వెన్నెలకు జీవీ.సుబ్బారెడ్డి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికా విద్యా వికాసానికి చదువే మూలమన్నారు. కోరమండల్ గర్ల్‌చైల్డ్ ఎడ్యుకేషన్ స్కీమ్‌లో ఎంపికైన వారిని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, ఉపాధ్యాయులు బాలికలను అభినందించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరు ఏర్పాటు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, సర్పంచి

విస్సన్నపేట: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తుగా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక సత్తుపల్లి రోడ్డులో పంచాయతీ నిధులతో శనివారం నూతనంగా బోరు ఏర్పాటు పనులను ఎంపీపీ, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మెయిన్ ట్యాంక్‌కు నీరు అందించేందుకు నూతనంగా బోరు, పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉన్న ఏరియాలలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, సచివాలయ కన్వీనర్లల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, పార్టీ నాయకులు పిల్లి రాజేష్, లకుం పవన్, సాధుపాటి కోటి, కరీం, శీలం శ్రీను పాల్గొన్నారు.

రాజధాని అంశంలో మోసం చేసిన కేంద్రం

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



కొండపల్లిలో మాట్లాడుతున్న షర్మిల

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాజధాని అంశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పదేళ్ల అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో ఇందిరమ్మ అభయం ప్రచార కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే పరిశ్రమలు, కేంద్రం నిధులు, ఉద్యోగాలు అధికంగా వస్తాయన్నారు. బీజేపీతో పాటు అప్పటి టీడీపీ ప్రభుత్వాలు రాజధాని అంశం అటకెక్కించాయని అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంటుతో అనేక మంది ఇంజినీర్లు, డాక్టర్లుగా ఎదిగారన్నారు. చంద్రబాబు బీజేపీకి బానిసలాగా మారారని విమర్శించారు. టీడీపీకి ఓటేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే ప్రత్యేక హోదాతో పాటు ఇందిరమ్మ అభయం పథకం అమలవుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు స్థానిక సమస్యలను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

శివాలయాల్లో రెండో రోజూ భక్తుల రద్దీ

వెల్వడం(మైలవరం): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని వెల్వడం గ్రామంలో శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల రద్దీ రెండోరోజు శనివారం కూడా కొనసాగింది. తిరునాళ్లకు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో భక్తులకు వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని కిరణ్‌కుమార్ రెడ్డి శనివారం తెలిపారు.

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామంలో వేంచేసి ఉన్న భ్రమరాంబిక మల్లేశ్వరస్వామి శుక్రవారం రాత్రి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. ఆలయ చైర్మన్ గొట్టిపూళ్ల బుచ్చివెంకట్రామ లక్ష్మీనరసింహరావు, గ్రామ సర్పంచ్ జి. రమేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు జి.చంద్రశేఖరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కుక్కడపు హనుమాన్ వెంకటరత్నం, ఈడ సీతా రామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని నరసాపురంలో ఉన్న శివాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించి అన్నసమారాధన చేశారు.

వెల్వడం(మైలవరం): మహా శివరాత్రి సందర్భంగా కుదుముల పద్మజ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ కుదుముల వెంకటనారాయణరెడ్డి దాతృత్వంలో భక్తులకు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ప్రవాసాంధ్రులు లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 వేల మంది భక్తులకు అన్నవితరణ చేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ

మైలవరం: స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రామాలయంలో శనివారం 21 మంది ఆర్యవైశ్య పేదలకు నిత్యావసర సరకులను సంఘం అధ్యక్షులు బయన శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కాజా మహేష్, సంఘం పెద్దలు గాంధీ, జూలకంటి ప్రసాద్, చారుగుండ్ల ప్రసాద్, కన్నయ్య, సూరిబాబు, కృష్ణమూర్తి, జూలూరు ఉమా తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామికి పూజలు

ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లి గ్రామంలో శనివారం బాలాత్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం ఏడు గంటలకు కనసానపల్లిలో వైభవంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు .

నేడు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ

ఏ.కొండూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ భూక్య గనియా శనివారం తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.